30

# త్యాగమే నిజమైన యోగము

**దివ్యాత్మస్వరూపులారా!**

ఐకమత్యమే జీవిత సూత్రము. సామాజిక కృషియే అభివృద్ధికి మార్గము. ప్రపంచమనగా కేవలము మన కంటికి కనుపించే, మనతో మాటలాడలేని భూమి మాత్రమేకాదు. సజీవమైన సమాజమే ప్రపంచము. ఐకమత్యము, కృషి రెండింటి యొక్క జీవితసారమే తారకమంత్రము. సేవకునికి ప్రధానమైనవి మూడు అంగములు. కార్యదీక్ష మొదటిది. రెండవది, నిర్మలప్రేమ. మూడవది, నిరహంకారము. దీనినే నిరాడంబరము అని కూడ చెప్పవచ్చును. కనుక నిరాడంబరము, నిర్మలప్రేమ, కార్యదీక్ష యీ మూడు సేవకునికి ప్రధానమైన దీక్షలు.

**మానసిక, ఆధ్యాత్మిక పరివర్తనలు లేని అభివృద్ధి సమాజమునకు శాంతి, భద్రతలను అందించలేదు**

మానవ నిర్మాణము విశ్వనిర్మాణము. మానవుడు మంచిగా ఉండినప్పుడే ప్రపంచము మంచిగా ఉంటుంది. వ్యక్తి ఉత్తముడైనప్పుడే సమాజముకూడను ఆదర్శవంతమైన సమాజముగా రూపొందుతుంది. కనుకనే వ్యక్తి మంచివాడుగా కావటానికి తగిన కృషి చెయ్యాలి. అప్పుడే సమాజముకూడను ఆదర్శవంతమైన సమాజముగా రూపొందుతుంది. ఈ సమాజము మంచిగా ఉండినప్పుడే దేశము సుభిక్షముగా, సుఖముగా ఉంటుంది. ఏతావాతా వ్యక్తి, సమాజము, ప్రపంచము యీ మూడు త్రిమూర్త్యాత్మక స్వరూపములే! ఈనాడు సమాజములో బాహ్యరీతిలో కలిగే మార్పులు అంత ప్రధానమైనవిగా మనము భావించరాదు. ఈ బాహ్య అభివృద్ధులుగాని లేక పరివర్తనలుగాని లక్ష్యముగా మనము తీసుకోరాదు. రాజకీయ పరివర్తన, ఆర్థిక పరివర్తన, సామాజిక పరివర్తన, యీ అన్నింటితోబాటు మానసిక పరివర్తన అత్యవసరము. ఈ మానసిక పరివర్తనతోబాటు ఆధ్యాత్మిక పరివర్తనకూడను అత్యవసరము. ఈ మానసిక, ఆధ్యాత్మిక పరివర్తనలే లేకుండిన మనము ఎన్నివిధములైన అభివృద్ధులు గాంచినప్పటికిని యివి సమాజమునకు అంత శాంతి భద్రతలు అందించలేవు.

srisathyasaivachanamrutam

**సాయిసంస్థల కార్యక్రమాలన్నీ హృదయముద్వారా జరుగవలసినదే!**

అందులో సాయిసంస్థలయొక్క ప్రభావము మానసిక స్థాయినుండియే ఆవిర్భవించాలి. బాహ్యమైన పరివర్తన మరియు అభివృద్ధులు ఒక విధమైన కళలవంటివి మాత్రమే. యీ arts అనేవి బయట ఉండేటువంటివి. Art అంతా heart నుండి ఉద్భవించినది. కనుక మీరు మొట్టమొదట గుర్తించవలసినది art is outside, heart is inside; art should come from the heart అనే సత్యము మీరు గుర్తించాలి. కనుక, సాయిసంస్థల కార్యక్రమాలన్నీకూడను heart ద్వారా జరుగవలసిందేగాని art ద్వారా జరగవలసినవి కాదు. ఇందులో త్యాగము అత్యవసరము. ఈ త్యాగమువల్లనే తగిన ఆనందము లభిస్తుంది. అప్పుడే మనము ఉత్తములుగాను, ఉన్నత స్థాయిలో ఉన్నవారుగను ప్రకాశించవచ్చు. కూడపెట్టటమే స్వభావముగా ఉండిన సముద్రమును మీరు చూశారు. నిరంతరము జలమును తాను కూడబెట్టుకుంటూ, తాను చేర్చుకుంటూ పోతుంది సముద్రము. ఈ కూడబెట్టే స్వభావముగల సముద్రము అట్టడుగునే పడిఉంటుంది. దీనికి విరుద్ధముగా అందలి జలము ఆవిరిగా పరివర్తన చెంది యీ సముద్రము యొక్క taste ను కూడను తీయతనంగా మార్చుకుని మేఘముల రూపములో ఉన్నతస్థాయికి పోయి వర్షిస్తూ ఉంటుంటాయి. అయితే, యీ సముద్రముయొక్క జలము ఆవిరిగా మారటానికి యేది కారణము? సూర్యుడు కారణము. సూర్యుని తేజస్సువలన యీ సముద్రజలము ఆవిరిగా మారి ఉన్నతస్థాయికి వెడుతున్నాది. ఇందులోనే ఉన్నత స్థాయికి చేరుకునే పరివర్తన జరుగుతూ వస్తుండాది. ఇదియే సరైన పరివర్తన. అట్లుకాకుండా సముద్ర జలమే పైకి పోయి ఉప్పురూపుగానే ఉంటూ "నేను బాగా ఉన్నాను, ఉన్నత స్థాయిలో ఉన్నాను", అని ఘర్జించినంత మాత్రమున ఆనీటికి ఏమాత్రము విలువ ఉండదు. ఉన్నతస్థాయియందు ఉండవచ్చుగానీ ఉన్నత గుణము యేమిటున్నది? కనుక ఉన్నత గుణము సంపాదించుకొని ఉన్నత రీతిలో ప్రబోధించటానికి తగిన వ్యక్తులుగా మనము తయారు కావాలి.

**వ్యక్తియొక్క సుఖ, సంతోషములు సమాజముయొక్క సుఖ, సంతోషములపై ఆధారపడి ఉన్నవి**

సమాజమనగా కేవలము మానవులయొక్క సమూహమనే సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. వ్యక్తియొక్క శక్తి సామర్థ్యములుకూడను సమాజముపైన ఆధారపడిఉన్నవనే సత్యాన్ని కూడను

sri sathyasai vahini vachanamrutam

గుర్తించాలి. వ్యక్తియొక్క సుఖ, సంతోషములు సమాజముయొక్క సుఖ, సంతోషములపైన ఆధారపడి ఉంటున్నవి. కనుకనే, "నాకున్న శరీర, మానసిక బుద్ధి, శక్తులను నానిమిత్తమైకాకుండా సమాజ నిమిత్తమై నేను ఉపయోగ పెట్టాలి" అనే త్యాగ భావము వ్యక్తులలో ప్రవేశించాలి. నిజముగా మన క్షేమము, మన ఆనందము, మన అభివృద్ధి సమాజముపైన ఆధారపడి ఉంటున్నవి. "నాతిండి నేను తింటున్నాను, నాయింటిలో నేను ఉంటున్నాను, నా బట్ట నేను కట్టుకుంటున్నాను. నేను స్వతంత్రుడను", అని భావించుకోటం కేవలము అజ్ఞానము. నీ తిండి నీకు ఎక్కడినుండి వచ్చింది? సమాజము నుంచే వచ్చింది. నీబట్ట నీకు యెక్కడనుండి వచ్చింది? సమాజమునుండే వచ్చింది. సమాజమును విసర్జించి జీవించటానికి ఒక్క క్షణమైనా వీలుకాదు. మన జీవితంలో ప్రతి ఒక్కటికూడను సమాజమునుండే మనము అందుకుంటున్నాము, అనుభవిస్తున్నాము. దానికి తగిన కృతజ్ఞతారూపకముగా సమాజమునకుకూడను తగిన ఆనందమును అందించటానికి ప్రయత్నించాలి. కానీ, వ్యక్తి ఈనాడు యింత విశాలమైన భావములో ప్రవేశించటం లేదు.

**ఈ జగత్తంతా ఒక సత్రమే!**

మూడు వందల సంవత్సరములకు పూర్వము కిర్కీ అనే గ్రామము ఉండేది. అది షిరిడీ దగ్గర. అక్కడ ఒక శ్రీమంతుడు ఉంటూ ఉండేవాడు. తన గృహము చాలా పెద్దదిగా ఉండేది. ఈనాడు లోకములో వ్యక్తియొక్క ఘనతను అతడు నివసించే గృహమును బట్టి అంచనా వేస్తున్నారు. ఇల్లు పెద్దదిగా ఉంటే 'ఓహో ఇతను గొప్ప శ్రీమంతుడ'ంటాము. ఇంటిలో తినటానికి తిండి లేకపోయినా సరే, అతను శ్రీమంతుడనే మనము భావిస్తాము. కానీ యిల్లు చాలా చిన్నదిగా యిరకాటంగా ఏదో ఒక hut మాదిరి ఉంటుంటే యితనెవరో పాపం బీదవాడని అతనియొక్క ఘనతను తగ్గిస్తాము. అదే విధముగానే మానవుని దేహమునకు ఉండిన పనులయొక్క ఘనతపట్టి యితను గొప్పవాడు, చిన్నవాడు అని మనము భావించుకోవచ్చు. ఒక సన్యాసి ఆ శ్రీమంతుని యింటికి వెళ్ళాడు, ఒక రోజున. సాయం సమయములో అక్కడకు వెళ్ళి ఆ శ్రీమంతుడు అరుగుపైన కూర్చుని ఉంటే అతనిని ప్రశ్నించాడు. "శ్రీమంతుడా! యీనాడు నేను మీయింటిలో విశ్రమించటానికి అవకాశముంటుందా!" అని. ఆ శ్రీమంతుడు 'ఏమిటిది సన్యాసీ! యిదేమి సత్రమనుకున్నావా?' అన్నాడు, కొంచెం కోపంతో. తక్షణం యీ సన్యాసి

sri sathyasai vachanamrutam

చిరునవ్వులు చిందులు త్రొక్కుతూ “ఓ శ్రీమంతుడా! ఒక ప్రశ్న అడుగవచ్చునా నిన్ను?” అన్నాడు. “ఆ! తప్పక అడుగు”, అన్నాడు. “ఈ పెద్ద భవనము యెవరు కట్టారు?” అని అడిగాడు. ‘మా ముత్తాతలు కట్టారు. Great grand father. అతని తరువాత మా grand father వచ్చాడు. మా grand father తరువాత, మా father వచ్చాడు. మా father తరువాత యిప్పుడు నేను owner', అన్నాడు. అప్పుడా సన్యాసి “ఇది సత్రము కాక యేమవుతుంది? నీ great grand father కొన్నాళ్లు నివసించాడు. తరువాత నీ grand father కొన్నాళ్లు నివసించాడు. తిరిగి మీ తండ్రిగారు కొన్నాళ్లు నివసించాడు. ఇప్పుడు మీరు నివసిస్తున్నారు. యిది సత్రము కాక యింకేమిటి? సత్రమే! సత్రములో కొంతకాలము నివసిస్తూ ఉంటారు, వెళ్ళిపోతుంటారు. నీ యిల్లని నీవు యెట్లు చెప్పగలవు. యిది సత్రముకాక యిల్లు అవుతుందా;” అన్నాడు సన్యాసి. సత్రము లోపల అనేకమంది వస్తూంటారు, పోతుంటారు. యిది వస్తూ, పోతూ ఉండేది. శాశ్వతముగా నీ great grand father నివసించాడా? అట్లా నివసించటానికి వీలుకాదు. కనుకనే ఒక సత్రమని యీ సన్యాసి గట్టిగా అన్నాడు. అయితే యీ దేహమనే సత్రమునందు ఒక ఉన్నతమైన, శక్తివంతమైన చైతన్యము నివసిస్తున్నాది. కనుకనే వేదాంతము “దేహోదేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః” అన్నారు. సనాతనమైన ఆత్మతత్త్వము నూతనమైన దేహము ధరించి యీ పురాతనమైన జగత్తునందు నివసిస్తున్నది. కాబట్టి, ఈ జగత్తంతా సత్రమే! “ఈ దేహము సనాతనమైన ఆత్మస్వరూపుడు నివసించే మందిరము” అన్నారు. ఆ విధముగా ఆశ్రీమంతుని మనస్సును పరివర్తన గావించి, ఆ శ్రీమంతుని నోటి ద్వారానే “దయచేసి ఈనాడు మీరు యిక్కడే ఉండవచ్చును. నేను యేవిధముగా ఉన్నానో మీరుకూడా అదేవిధముగా ఉండవచ్చు” అని చెప్పించాడు, ఆ సన్యాసి. ఆ కిర్కి సమీపములో ఉన్నదే పత్రిగ్రామము. అందువల్లనే అబ్దుల్ బాబా చెప్పాడు :

**పత్రిగ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం**
**భక్తాభీష్ట ప్రదం దేవం సాయినాథం నమామ్యహం**

‘పత్రిగ్రామ సముద్భూతం’, పర్తియందు జన్మించినటువంటి, ‘ద్వారకామాయి వాసినం’ షిర్డి సాయిబాబా మొట్టమొదట ద్వారకా మాయిలోనే ఉండినటువంటివాడు. ‘భక్తాభీష్టప్రదం దేవం’,

srisathyasai vachanamrutam

'భక్తుల అభీష్టాలను నెరవేర్చేటువంటి', 'ఓ సాయినాధా నీకు నమస్కారము.'

**శరీరము పరోపకార నిమిత్తమేగాని స్వార్థముకొరకు కాదని మానవుడు గుర్తించాలి**

ఈ జగత్తులో ప్రతి ఒక్కటికూడా అశాశ్వతమైనవేకాని శాశ్వతము, సత్యమైనవి మనకు కానరావు. మానవ జీవితమునందే ఉపకారంగాని, ఆదర్శవంతమైన కర్మలుగాని, దివ్యమైన చేతలుగాని జరపటానికి వీలున్నది. కనుకనే 'జంతూనాం నరజన్మ దుర్లభం', అన్నారు. మానవజన్మ అంత దుర్లభమైనది. ఈ దేహము దేని నిమిత్తమై వచ్చింది? 'పరోపకారార్థ మిదం శరీరం.' ఈ శరీరము పరోపకార నిమిత్తమై ఏర్పడినదేగాని స్వార్థంకోసం కాదనే సత్యాన్ని మొట్టమొదట మనం గుర్తించాలి. దీనిలో కూడను ఎలాంటిది? 'కర్మణ్యేవ అధికారస్య', కర్మాచరణకు నీకు అధికారము ఉంటుంది. అందులోనూ త్యాగమయమైన కర్మలాచరించాలి.

**పరోపకారాయ ఫలంతి వృక్షః పరోపకారాయ వహంతి నద్యః**
**పరోపకారాయ దుహంతి గావః పరోపకారార్థ మిదం శరీరమ్.**

'పరోపకారాయ ఫలంతి వృక్షః', వృక్షము ఫలములనందిస్తుంది. ఇది నాఫలము కదా అని వృక్షము యేకించిత్తైనా కూడను తాను ఆరగించటం లేదు. ఇది వృక్షము యొక్క త్యాగము. 'పరోపకారాయ వహంతి నద్యః', నది కావలసినంత జలమును ప్రవహింప చేసుకుంటుంది. కానీ ఆ జలము లోపల ఒక చుక్కైనా తాను త్రాగదు. ఈ జలమంతా కూడను పరోపకార నిమిత్తమై ప్రవహింప చేస్తుంది. 'పరోపకారాయ దుహంతి గావః', గోవు పవిత్రమైన, విలువైన క్షీరమును మానవులకందిస్తుంది. అందులో కావలసినంత విటమిన్సు అందిస్తున్నది. యివి నాపాలు కదా అని ఒక చుక్కైనా తాను త్రాగదు. నిజముగా యీ జగత్తులోపల వృక్షములు గాని, జలముగాని, లేక గోవులు కాని లేకపోతే మానవుడు ఒక్కక్షణమైనాకూడను జీవించలేడు. మానవునికి కావలసినంత ప్రాణశక్తినంతా వృక్షము, జలము అందిస్తున్నాయి. మానవునికి అవసరంలేని కార్బన్‌డైయాక్సైడ్‌ను వృక్షములు తీసుకొని ఆక్సిజన్ అందరికి అందిస్తాయి.

**త్యాగమువల్లనే నిజమైన యోగము చేకూరుతుంది**

ఐతే, ఈనాడు యీ సత్యాన్ని గుర్తించి తెలివితేటలు కల్గి విద్యావివేకవంతుడైన మానవుడు మాత్రము త్యాగమునకు సిద్ధముగా లేకున్నాడు. ఒక వృక్షములో ఉండిన త్యాగములో వేయింట

ఒక భాగమైనా మానవునియందు లేకపోతోంది. జలములో ఉన్న త్యాగములో వెయ్యింట ఒక భాగమైనా మానవునియందు లేకపోతోంది. పశువు యందుండిన యీ త్యాగమందు కూడను, పశుపతిగా మారవలసిన యీ మానవునియందు కొంచెమైనా లేకపోతోంది. పశు, పక్షి, మృగాదులుకూడను త్యాగములో పాల్గొని తమయొక్క జీవితాన్ని అంకితము గావించి పవిత్రమైన నరజన్మమునకు చేరుతూ వస్తున్నవి. ఇటువంటి పరిస్థితులలో మానవుడు తన ఉన్నతి నిమిత్తమై తాను త్యాగం చేయకుండా ఉన్నాడంటే యివి యెంత కఠినమైన హృదయములో యోచించుకోవచ్చును. త్యాగము వల్లనే మనకు నిజమైన యోగము చేకూరుతుంది. ఈనాడు మనము 'భోగము, భోగము' అనుకుంటున్నాము. సుఖముగా తింటున్నాము. సుఖముగా ప్రయాణాలు చేస్తున్నాము. సుఖముగా నిద్రిస్తున్నాము. 'ఇది మా భోగము, యిది మా అదృష్టము' అనుకుంటున్నాము. ఇది భోగముకాదు. ఈ తిండి, యీ సుఖము, యీ విధమైన అనుకూలములు నిన్ను క్రమక్రమేణా రోగానికి తీసుకునిపోతాయి. భౌతికమైన యీ భోగములన్నీ కూడను మనకు రోగ సంబంధమైనవేగాని, యోగసంబంధమైనవి కావు. త్యాగమే నిజమైన యోగము. ఏనాటికైనా, యెప్పటికైనాకూడను యీ జగత్తునందు మనం త్యాగము చేయక తప్పదు. అయితే, దేనిని త్యాగం చేయటము? ఆస్తిపాస్తులు త్యాగము చేయటమా? లేక ధన, కనక, వస్తు, వాహనాదులు త్యాగము చేయటమా? ఇవే కనుక అయితే, సులభముగా త్యాగము చేయవచ్చు.

కాదు, కాదు. ఇవి కాదు, మనం చేయవలసిన త్యాగాలు. ఇవి భౌతికమైన జగత్తునందు కొంతవరకు సుఖముకొరకు చేసే త్యాగాలే! మనయందుండిన కామ, క్రోధ, ద్వేషములు మూడింటిని త్యాగము చేయాలి. కామము - భక్తి నాశనం. క్రోధం-జ్ఞాననాశనం. లోభము-కర్మనాశనం. లోభి కర్మనాచరించటానికి పూనుకోడు. క్రోధముగా ఉండినవానికి జ్ఞానము యేమాత్రము పనిచేయదు. కనుక జ్ఞానాన్ని చంపుకుంటాడు వాడు. కామంగా ఉన్నవానికి నిజమైన భక్తి అలవడదు. కనుకనే భక్తి, జ్ఞాన, కర్మలను అభివృద్ధి గావించుకోవాలంటే యీ మూడు కూడను అనగా కామక్రోధ లోభములే మొట్టమొదట త్యాగము చేయాలి. ఇట్టి త్యాగము చేసినవాడు అమృతపుత్రుడు అన్నారు. కనుక, మనకు లభించిన దానిలో సాధ్యమైనంతవరకు మన ఆశలను అదుపులో ఉంచుకొని, కొంత లౌకికమైన త్యాగములోకూడా

srisathyasaivachanamrutam

పాల్గొనాలి. ఆ విధమైన ప్రాపంచిక సంబంధమైన త్యాగమము చేసినప్పుడే యీ లోభము తగ్గటానికి అవకాశము ఉంటుంది. కనుక, త్యాగము యీవిధమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

**భవరోగమునకు మందు భగవన్నామ స్మరణయే !**

ఈనాడు మనకు కావలసినది ప్రచారము కాదు. సత్యసాయి సంస్థలయొక్క దివ్యమైన కీర్తిని అభివృద్ధి గావించాలంటే ఆచారము అత్యవసరము. ప్రపంచములో ఎన్నో సంస్థలు కావలసినంత ప్రచారాలు చేస్తూనే ఉన్నాయి. రేడియోలలో ప్రచారం చేస్తున్నారు. టెలివిజన్‌లలో ప్రచారము చేస్తున్నారు. ఇంకా వ్యక్తులద్వారా గ్రామగ్రామాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కాని, యిది నిజమైన ప్రచారంకాదు. ఇవి నిజమైన మార్పులుకావు. నిజమైన నిర్మాణాలు కావు. హృదయ పరివర్తనను తీసికొని వచ్చేది మనయొక్క ఆచారమే! ఆచరణవల్ల మానవునియొక్క ప్రవర్తనను కొంతవరకు మార్చటానికి వీలవుతుంది. కేవలము ప్రబోధలవల్ల ప్రవర్తన మార్చలేము. ఆచారముతోపాటు కొంత ప్రచారముకూడా ఉండవలసిందే! కొన్ని జబ్బులకు ఔషధమును లోపలకు సేవించాలి. కొన్ని జబ్బులకు పైతట్టు మాత్రమే తిక్కాలి. భవరోగమనే రోగానికి మెడిసిన్ లోపలకు పుచ్చుకోవాలి. పైన యేదో గాయం తగిలింది. దీనిని అలక్ష్యం చేస్తే అది సెప్టిక్ అవుతుంది. పైతట్టున ఆపుండుకు ఆయింట్‌మెంటు రాయాలి. లోపలసెప్టిక్ కాకుండా ఉండటానికి కొన్ని పిల్సు తీసుకోవాలి. మనకు పట్టినది, భవరోగము. దీనికి మందు లోపలకు తీసుకోవాలి. అదే భగవన్నామ స్మరణం. బయట తట్టు మనప్రవర్తనలో కొంతవరకు మార్పు తెప్పించాలి. ఈ రెండింటి మార్గంవల్లనే భవరోగములను నివారణ గావించుకోగలము.

**ఆధ్యాత్మిక తత్త్వం ప్రజలను సంతృప్తి పరచడంకోసం కాదు, ప్రభువును సంతృప్తి పరచేకొరకు**

మీమీ అనుభవాలు మీకు వేరువేరుగా ఉండవచ్చును. సత్యసాయి సంస్థలకు, సత్యసాయికి యెట్టి సంబంధము లేదు. మీరు కోరటంచేతనే మీకు కొంత ఆదేశాన్ని అందించటానికి నేను పూనుకొన్నాను కానీ సత్యసాయి ఆర్గనైజేషన్‌లోని భక్తుల మధ్య భేదభావములను గురించి నేను ప్రస్తావించదలచలేదు. భక్తుల అభివృద్ధులు, భక్తుల ఉత్సాహములు, భక్తుల ప్రోత్సాహములు మరియు మీ వ్యక్తిగత అభివృద్ధి నిమిత్తమై, సత్సంగముయొక్క ప్రభావము నిమిత్తమై, మీ అందరి ఐకమత్య నిమిత్తమై మీరీవిధమైన ఉత్సాహవంతమైన కార్యములు చేపడుతున్నారు.

sri sathyasai vachanamrutam

మీభక్తియొక్క ప్రతిబింబములే యివి. మీ భక్తియొక్క ప్రతిధ్వనులే యివి. అయితే, ఆ భక్తిని సరైన రీతిలో నిల్పుకోటానికి పూనుకోవాలి. ఆ భక్తిని మనం ఆచరిస్తూ పదిమందికి ప్రచారం చేయటానికి పూనుకోవాలి. నీలో భక్తి లేకుండా ప్రచారంలో ప్రవేశిస్తే యిది ఆదర్శవంతమైనది కాకుండా అనేక విధములైన పెడమార్గములు పట్టటానికి అవకాశము ఉంటుంది. ఈనాడు ప్రపంచము వెయ్యి కళ్ళతో చూస్తున్నది, మనలను. నీవు చెప్పేది నీవు చేస్తున్నావా లేదా అని గమనిస్తోంది, ప్రపంచము. నీవు చేస్తున్నప్పుడు పైకి చెప్పక పోయినా కాని, యితరులు దానిని ఆచరించటానికి పూనుకుంటారు.

కనుక, మీరు ఆచరిస్తూ యితరులకు బోధించటానికి ప్రయత్నించటము చాలా మంచిది. ఇందులో self, help రెండూ చేరి ఉంటాయి. అదే స్వార్థము, పరార్థము. మొట్టమొదట **self.** దీనిని మనం ఆధారంగా తీసుకోవాలి. ఇదే foundation. అయితే ఇదంతా దేనికోసం? Foundation వేసి కూర్చుంటారా? మరి పైన భవనాలు కట్టాలి. లేకపోత foundation వేసి ప్రయోజనము లేదు. ఇక్కడ నీ స్వార్థమనేదికూడను పరార్థమనే భవనంపైన ఆధారపడి ఉంటుంది. అనగా బయటివారికి చేసే సేవలు, బయటివారికి చెప్పే విషయాలు, బయటివారికి బోధించే బోధలు నీ స్వార్థంపైనకూడను ఆధారపడి ఉంటున్నాయి. కారణం, నీ క్షేమము అంతాకూడను ఇతరుల క్షేమంపైన ఆధారపడి ఉంటుంది. అయితే, ఆధ్యాత్మికతత్త్వం ప్రజలను సంతృప్తిపరచటంకోసం కాదు, ప్రభువును సంతృప్తిపరచేకొరకు. ఈ లక్ష్యాన్ని మనము స్వీకరించాలి. నీప్రభువును నీవు సంతృప్తిపరచటానికి పూనుకుంటే ప్రజలు, ప్రపంచమంతాకూడను సంతృప్తి చెందుతారు. నీకాళ్లకు నీవు చెప్పులు వేసుకో. ముళ్లతో నీకే బాధ ఉండదు. మొట్టమొదట స్వార్థముతో నీ భద్రతను నీవు సంపాదించుకో. తరువాత ఎలాంటి స్థానములోనైనా నీవు ప్రవేశించు. అయితే, పరులు నీపైన వేలుపెట్టి చూపించకుండా ఉండేటువంటి ప్రవర్తనతో నీవుండాలి. ఇదే ఈనాడు మనకు కావల్సింది.

**నియమము శ్రేయస్సుకొరకు నియమింపబడినదే!**

దివ్యాత్మస్వరూపులారా! సేవలనిన యేసేవలైనా మీరు చేయవచ్చు. అది, యిది అనే నిబంధన యేమీ లేదు. కానీ భావముమాత్రం పవిత్రమైన భావము పెట్టుకొని చేసుకోండి.

sri sathyasai vachanamrutam

సేవలలో యిది, అది అనే దానిలో పోట్లాడుకోవటంగాని, తర్కించుకోటంగాని కాలమును వ్యర్థము చేసినట్లవుతుంది. మీ పరిసర ప్రాంతములనుబట్టి అక్కడివారికి యే సేవలు అవసరమో వాటిని మీరు చేపట్టటానికి ఎట్టి అభ్యంతరము లేదు. అయితే, నా ఉద్దేశ్యము యేమంటే సంస్థలయొక్క పేర్లుకాని, లేక సేవలు కాని, ఒక uniform గా ఉంటే మంచిది. ఒక state లో ఒక పేరు యింకో state లో యింకొక పేరు యిలా పెట్టుకుంటే అది సరిగా ఉండటానికి వీలుకాదు. అది organisation అవచ్చు లేక workers సమాజమనుకోవచ్చు లేక సేవాసమాజ మనుకోవచ్చు. ఈ పేర్లు మటుకు మీకు మీరే నిర్ణయం చేసుకోవచ్చు. అయితే ఏది నిర్ణయం చేసినా అది భారతదేశములో అన్ని రాష్ట్రములయందును ఒకేపేరుగా నడచుకుంటూ పోవాలి. దీనిని మీరు స్వార్థమని గాని, స్వప్రయోజనమనిగాని భావించరాదు. ఎందుకంటే ఆపేరు, ఆ డిసిప్లిన్ ఉండినప్పుడు మన సంస్థను గురించి మనం చెప్పకుండానే కొంతవరకు జగత్తు గుర్తిస్తూ వస్తుంది. నియమము లేక యేపని చేయలేము. నియమము శ్రేయస్సు కోసం నియమించినదే! 'నశ్రేయో నియమం వినా.' ఒక విధమైన పేరుగాని, ఒక డిసిప్లిన్‌గాని, ఒక రూల్సుకాని లేకపోతే మనము ఏసంస్థలోకూడ పని చేయలేము. అయితే నాఉద్దేశ్యము ఈ రూల్సు అండ్ రెగ్యులేషన్స్ అంతా భారతదేశమంతటా ఒకేవిధంగా యూనిఫామ్‌గా ఉండాలి. మీ పద్ధతిని, మీ ప్రవర్తనను చూచి "ఓహో! ఇది సత్యసాయి ఆర్గనైజేషన్," అని ప్రజలలో ఆవిధమైన దృష్టిని తెప్పించాలి.

**సత్యసాయి సంస్థలలో ధనము విషయంలో చాలా strict గా ఉండాలి**

యింకొక ఉద్దేశము నాది ఏమంటే ఏదో మనము గొప్పగా చేయాలని ఆశపడి పెద్దపెద్దగా చేయనవసరం లేదు. ఈనాడు ప్రపంచములో ఎట్టిసేవ చేయాలనుకున్నా కొంత ఆర్థికమైన ఆధారం ఉంటుండాలి. యీ ధనము నిమిత్తమై ప్రాకులాడినప్పుడు మన మనస్సులో ఒక లోటు కల్గిపోతుంది. కనుక, ఎవరైనా డబ్బుగలవారు కొందరు వారిలో వారు వేసుకొని ఏదైనా సేవా కార్యక్రమం నడిపించవచ్చు. ఐతే మనకు యెంత ఉందో అంతవరకే మనము పనిచేద్దాము. ఒకవేళ ఎక్కువ చేయాలనుకున్నప్పుడు ఎవరైనా శ్రీమంతులు, త్యాగులు వచ్చినప్పుడు వాళ్ళ మనస్ఫూర్తిగా అంగీకరించి ఆర్థికంగా తోడుంటే తప్పక దానితో మనం చేయవచ్చు. అంతేగాని,



srisathyasaivacharamrutam

పెద్దయెత్తున కార్యక్రమాలు చేయాలని ఆశించి అందరి దగ్గరా మనం చేతులు చాపటమనేది సత్యసాయి ఆర్గనైజేషన్‌కు సరైనది కాదు. ధన వ్యయముతో కూడిన సేవలు మనకు శక్తిఉంటే చేయవచ్చు, లేకపోతే మనకు ఎంతశక్తో అంతవరకు చేయడం మంచిది. ఒక చిన్న ఉదాహరణ. ధనము మనకు కావాలి. అడగటానికి పోతాము. ఇచ్చిన వారు ఒక్కొక్కరి మనసు ఒక్కొక్క రకంగా ఉంటుంది. "నేను యిచ్చే డబ్బు సద్వినియోగం చేశాడా లేదా? నేను డబ్బుయిచ్చిన వానిని కనుక నాకు ప్రత్యేకమైన విలువ యివ్వాలి", ఇలాంటి కొన్ని అహంకార భావములకు లేక అజ్ఞాన భావములకు లేక అసూయా భావములకు మానవులు గురవుతారు. కనుక అలాంటి భావములు వారిలో రాకుండా ఉండటానికి చూచుకోవాలి. ఇప్పుడు బయటి ప్రపంచములో యిలాంటివి యెన్నో జరుగుతున్నాయి. మనం చూస్తున్నాము, వింటున్నాము. కనుక అలాంటి అపోహలకు సత్యసాయిసంస్థలలో అవకాశాన్ని అందించకుండా చూసుకోవాలి. కనుక, ధనము విషయంలో అతి strict గా ఉంటుండాలి.

**సత్యసాయి సంస్థలలో క్వాంటిటీకి పోయి క్వాలిటీని చెడగొట్టవద్దు**

సత్యన్నారాయణ చెప్పాడు, ఒక్కొక్క స్టేట్‌కు ఒక మొబైల్ వ్యాన్ పెట్టుకొని, మెడికల్ వీక్లీ చెక్‌అప్‌లు చేయాలని. కానీ, దీనిలో మీరు కొంత జాగ్రత్త వహించాలి. మెడికల్ సేవలు కొంతవరకు ప్రభుత్వముతో సంబంధము కల్గి ఉంటాయి. అనేక ఇతర సంస్థలన్నీ eye camp లని, పోలియో ఆపరేషన్‌లని, యిలాంటివన్నీ చేసి కొన్నింటిలో ఫెయిల్ అయిపోతున్నాయి. అందువల్ల కొన్ని states లో యీ సేవా సంస్థలు యిలాంటి కార్యక్రమాలు చేయాలంటే గవర్నమెంటు పర్మిషన్ కావాలని ఒక నిబంధన చేశారు. అయితే, మేము యీ విధముగా failure లేకుండా చేయగలమని చెప్పటం సరియైనదికాదు. వందలు, వందలు మనము ఆపరేషన్స్ చేసేదానికంటె ఒక పదిమంది లేక యిరవైమందికి సహాయపడే చిన్నచిన్న మెడికల్ క్యాంప్స్ పెట్టి మనకున్న డాక్టర్సుద్వారా ఎక్కువ ఖర్చులేకుండా success అయ్యేటట్టుగా చేసుకోటానికి ప్రయత్నం చేయవచ్చు.

మన సంస్థలలోపల క్వాలిటీని మాత్రము చెడగొట్టకండి. మీరు క్వాంటిటీ కోసం పోతే క్వాలిటీ చెడిపోతుంది. కనుక దీంట్లో మీలో మీరు సంప్రదించుకొని ఏవిధముగా చేస్తే

srisathyasaivachanamrutam

బాగుంటుందని నిర్ణయం చేసుకోవాలి. బీదవాళ్లు డాక్టర్లును కలుసుకొని వాళ్లచేత యీ విధమైన కార్యము చేసుకోటం సాధ్యము కాదు కనుక మనము సహాయము చేయటంలో తప్పులేదు. అయితే యింకా ఒక ఉపాయం చేయవచ్చు. ఎవరైనా అలాంటి బీదవారు ఐదారుమందిని మీరు తీసుకొని ఒక డాక్టరు దగ్గరికి పోయి, ఆ వైద్యం ఖర్చు మేమిస్తామని బయటడాక్టర్లు చేత మనము వైద్యం చేయించవచ్చు. కాని Responsibility మాత్రం మనము తీసుకోకూడదు. ఈ విధమైన responsibility తీసుకోటం మూలంగా యేమవుతుందంటే ఒకటో, రెండో ఫెయిలయ్యాయనుకోండి. అప్పుడు సత్యసాయిబాబా సేవా సంస్థవారు ఆపరేషన్ చేయించి మాకన్నులు పోయాయని ఏడుస్తారు. యిలాంటివి తప్పక జరుగుతాయి. కావాలంటే వారికి help చేయండి. వారు మూడు నాలుగు దినాలు ఆస్పత్రిలో ఉంటే వారి ఖర్చులు మనము భరించుకోవచ్చును. ఈ responsibility అంతా doctors పైననే వేయాలి. ఈ విధమైన కొన్ని యుక్తులుకూడను చాలా అవసరమే!

**అహంకారమనే రోగమునకు నివారణ లేదు**

అయితే, ముఖ్యముగా యిక్కడ సత్యసాయి సేవాసమితి పేరు ఉండాలని కొంతమంది, ఉండకూడదని కొంతమంది వాదిస్తుంటారు. నిజానికి, ఈ సేవ చాలా అవసరమైనది. మనము చేసేది సేవనే! సేవవల్లనే 'నేను సేవకుడను' అనే భావము మనలో ప్రవేశించి మనలను యెంతైనా ఉన్నతస్థాయికి తీసుకొని పోతుంది. సేవాభావము లేకపోతే అహంకారము విజృంభించవచ్చు. మీకందరికి తెలుసును, రామాయణము లోపల హనుమంతుడు ఎంత బలవంతుడు, గుణవంతుడు, శక్తి మంతుడో! అలాంటి హనుమంతుడు లంకలోనికి వెళ్ళినప్పుడు రాక్షసులంతా ప్రశ్నించారు, 'నీవెవరు?' అని. అప్పుడు హనుమంతుడు చక్కగా "దాసోహం కోసలేంద్రస్య, అయ్యా! నేనెవరనుకుంటున్నారు? శ్రీరామచంద్రుని దాసుడను" అన్నాడు. Servant అనే దానిలోపల యెంతో గుణము ఉంటుండాది. ఎంతో ఫలము ఉంటుండాది. ఎంతో తేజస్సు ఉంటుండాది. అప్పుడే దైవబలముకూడను అందులో ప్రవేశిస్తుంది. నేను దాసుడు కాదనుకున్నప్పుడు అహంకారము ప్రవేశిస్తుంది. ఈ అహంకారము మనలను అధః పతనము గావిస్తుంది. నిన్న చెప్పాను, 'ఏమందులకు లొంగేది కాదు, యీ అహంకామనే

sri sathyasai vachanamrutam

రోగమ'ని. ఎన్ని దేశాలైనా వెళ్లి specialists తో చూపించుకోండి. అహంకారమనే రోగము నివారణ కాదు. ఒక్క వినయముతోనే అహంకారము నశిస్తుంది. అందువలనే విద్యయందుకూడను 'విద్యావినయ సంపన్నే,' విద్యావంతుడైనవాడు వినయముగా ఉండాలన్నారు.

**విద్యయొసగును వినయంబు**
**వినయమునను కలుగు పాత్రత**
**పాత్రతవలన ధనము ధనమువలన ధర్మంబు**
**దానివలన ఐహికాముష్మికంబు బొందు నరుడు**

కనుక, ఐహికాముష్మికములను పొందటానికి వినయమే చాలా ప్రధానమైనది. వినయముతో మనము యీ కార్యములో ప్రవేశించాలి.

**సత్యసాయి సేవాసంస్థలలో ప్రతిఒక్కరు చేరడానికి అవకాశము కల్పించాలి**

మీరు ముఖ్యముగా గమనించవలసినది యింకోటి. నాఉద్దేశ్యము మీకు చెబుతున్నాను, అది మీకు సంతృప్తికరముగా ఉంటే తప్పక చేయవచ్చును, లేకపోతే మీ ఆనందాన్ని అనుసరించి మీరు ప్రవర్తించవచ్చు. ఇప్పుడు యేమవుతున్నాదంటే సత్యసాయి ఆర్గనైజేషన్ వేరు, సామాన్య సాయి భక్తులు వేరుగా విభజించుకుంటూ పోతున్నారు. అనేక లక్షలమంది ప్రశాంతి నిలయానికి వస్తూ ఉంటారు. స్వామిపైన విశ్వాసముచేతను, భక్తిచేతను వారివారి యిండ్లలో పూజ చేసుకుంటూ ఉంటారు. అట్టి సామాన్యమైన భక్తులకు, యీ ఆర్గనైజేషన్‌కు యెట్టి సంబంధము లేకుండా ఉంటున్నాది. ఇది సరైనది కాదు. ప్రతి ఒక్కరూ యీ ఆర్గనైజేషన్‌లో చేరటానికి అవకాశము నందించాలి. మనమంతా ఒక సొసైటీ. మనమంతా ఒక కుటుంబమనే ఏకత్వ భావాన్ని మనము అభివృద్ధిపరచాలి. ఇతరులు దీనిలో ప్రవేశించకుండా ఉండటానికి కొన్ని కారణాలున్నాయి. "అయ్యా! యీ సంస్థలో కొన్ని డిసిప్లినులు, నిబంధనలు చాలా కఠినంగా ఉంటున్నాయి. ఆ పర్మిషన్ కావాలి, యీ పర్మిషన్ కావాలి అంటూంటారు. అంతవరకు మేము కాచుకు కూర్చోలేము. మాస్వామి సేవ మాయింటిలో స్వేచ్ఛగా చేసుకుంటాము. దీనివల్ల మేము సంస్థలో ప్రవేశించలేకపోతున్నాము", అని కొంతమంది అంటున్నారు.

sri sathyasai vachanamrutam

కనుక, యిలాంటి పరిస్థితిలో మన రూల్సుకూడను కొంతవరకు సడలించాలి. భక్తులకు కొంత స్వేచ్ఛనివ్వాలి. ఇది మిలట్రీ డిసిప్లిన్‌కాదు. ఇది spiritual dicsipline. ప్రేమకు, ప్రేమకు సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని చేకూర్చాలి. 'మీరందరుకూడను మా సంస్థలో మెంబర్సే', అని ఈ విధమైన స్వాతంత్ర్యము వారికి యివ్వాలి. 'పో! నువ్వు మెంబరు కాదు', అని నెట్టకూడదు. అందరూ మనవారే! 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. అందరియందు ఉండిన భగవంతుని ఒకరి విషయంలో పొమ్మని, ఒకరి విషయంలో రమ్మని కోరటానికి వీలవుతుందా? యిక్కడ ఆర్గనైజేషన్ వారంతా ఉంటుంటారు. మీకు సమీపములో ఉండినవారు, స్వామిని గురించి తెలిసినవారు ఎవరైనా ఉంటే మీరు చేరండి, మీరూ చేరండని ఉత్సాహ ప్రోత్సాహాలు ప్రతి ఒక్కరూ ప్రతిఒక్కరికి యివ్వాలి. ఎవరెవరు పుట్టపర్తికి వచ్చిపోతున్నారో వారందరిని మీరు చేర్చుకొని, వారందరికి యీ ఎడ్రసు యిచ్చి వారందరు యిందులో చేరుకోటానికి తగిన అవకాశము యివ్వాలి. ఒక కుటుంబములో భార్య, భర్త, అల్లుడు, కోడళ్లు అంతా ఉంటారు. మాయింటికి భార్యాభర్తలమే పెద్దలమని వాళ్లు మాత్రమే భుజించి పిల్లలకు భోజనాలు పెట్టకుండా ఉంటారా? ఆ కుటుంబములో ఎవరెవరు ఉన్నారో వాళ్లందరూ తినాలి, వండినదానిని. ప్రశాంతి నిలయమనేది ఒకరిసొత్తు కాదు, అందరిసొత్తు. అందరూ స్వామికి చెందిన వారే, స్వామి అందరివాడే! అలాంటి భావాన్ని పెంచుకొని అందరిని చేర్చటానికి తగిన కృషి చేయాలి. అప్పుడే సంస్థలు అభివృద్ధి అవుతాయి. సత్యసాయి సంస్థలు సముద్రమువలె వ్యాపించి పోవాలి గాని కేవలము చిన్నచిన్న నూతులు మాదిరి తయారు కాకూడదు. అనగా మనలో విశాలమైన భావములు రావాలి. ఇలాంటి విశాలమైన భావము వచ్చినప్పుడే అందరూ తరిస్తారు. అందరూ బాగుపడతారు. అందరియందు ఉండిన ఉన్నత భావాల్ని మనము స్వీకరించటానికి అవకాశము ఉంటుంది. ఎంతకాలమైనప్పటికి 'యింతే, యింతే' అనుకుంటూ కూర్చుంటే ప్రయోజనము లేదు. మన సంస్థ విశాలమైనదిగా యేర్పడాలని అనుకుంటే యీ విధమైన అవకాశము అందరికి అందించాలి. అయితే force మాత్రము ఉండకూడదు. చేరే తీరాలని నిర్ణయము చేయకూడదు. ఎవరు వచ్చినా welcome. అందరినీ స్వాగతము చేయాలి.

ఇక్కడ ఏవైనా సేవలు చేస్తుంటే 'మేముకూడా చేస్తామండి', అని వస్తారు. తప్పక వారిని ప్రవేశింప చేయాలి. వారికి నేర్పించాలి మనము. ఇప్పుడు మనము పల్లెలలో సేవకు పోతున్నాము.

sri sathyasai vahini amrutam

పల్లెలు పూడుస్తున్నాము. ఆ పల్లెలవారు వచ్చి మేమూ చేస్తామంటారు. వారికి తగిన పని వారికి యివ్వండి. వారికికూడా పనులు యిస్తుంటే వారుకూడా ముందు ముందు దీనిలో ప్రవేశించి యెంతైనా అభివృద్ధి గాంచటానికి అవకాశము ఉంటుంది. ఈనాడు workers చాలా అవసరము. మీరందరు యిక్కడ ఉంటున్నారు, ఆఫీసు బేరర్సు, స్టేట్ ప్రెసిడెంట్సు. యిందులో యెవరూ వర్క్ చేసేవారు లేరు. అంతా చెబుతూ ఉంటారు! అంతవరకే! కాని, అదీ ఉండవలసినదే! చేసేటువంటివారికి ట్రైనింగు యివ్వాలి. మాస్టర్ ఉండాలి. Servants కూడా ఉండాలి. Master సరైన రీతిలో తెలిసినవారుగా ఉంటే Servants చక్కగా పనిచేయగలరు గానీ Masters యేమీ తెలియనివారుంటే వీరు టోపీవేస్తారు. Worker కంటే Master కి మరింత తెలివితేటలు, ఆ work విషయము తెలిసినవారుగా ఉంటుండాలి. కనుక, మనము కూడను workers గా తయారుకావాలి. నేను అప్పుడప్పుడు మా MBA పిల్లలకు sunday, sunday క్లాసులు తీసుకుంటాను. "అయ్యా! మీరు నేను MBA ప్యాస్ చేశాను, నేను మేనేజ్‌మెంటులో ఉంటాను', అని Aircondition room లో కూర్చుంటే ప్రయోజనము లేదు. Workers దగ్గరికంతా పోయి workers ఏవిధముగా పని చేస్తున్నారు యీ production యేవిధముగా ఉంటుండాది, చేసిన దానిని collection ఎట్లా చేసుకోవాలని అన్నీ చూచుకొని, యీ market విలువ యెట్లా ఉంటున్నాది యీ విధంగా అందరితోనూ connection పెట్టుకోవాలి" అని. యిది నిజమైన awareness. సంస్థలలో Communication చక్కగా ఉంటుండాలి. Communication అంటే వూరికే Phone లో మాట్లాడటంకాదు. Understanding is communication. కనుక మన సంస్థలలో ఆఫీసు బేరర్సు, workers మధ్య communication చక్కగా ఉంటుండాలి. ఏ work కు ముందు ఆ work కు సంబంధించిన విషయాలు చక్కగా చర్చించి ప్రణాళికలు ముందుగా సిద్ధము చేసుకోవాలి. Production, production అంటారు. Production ఉండినంత మాత్రమున ప్రయోజనము లేదు. దానికి సరైన workers సంస్థలో ఉన్నారా లేదా, ఈ work కి తగిన raw material ఉంటున్నదా లేదా దీనికి తగిన current supply ఉంటున్నదా లేదా, water ఉంటున్నదా లేదా, ఇతర సౌకర్యాలు అన్నీ ఉన్నాయా యంత్రాలు సరిగా ఉన్నాయా లేదా యివన్నీ కూడను ఆ communication కు చేరినవే! మనకి మనము నేను state president అనుకుంటే అంతమాత్రముతోనే కాదు.

sri sathyasai vachanamrutam

సంస్థయొక్క అన్ని విభాగములు, వాటి మధ్య సంబంధ బాంధవ్యములు అన్నీ కూడను చక్కగా బోధించి తాము వేసుకున్న master plan ను సరిగా అమలు గావించే శక్తి సామర్థ్యములు గల్గి ఉంటుండాలి. సంస్థలో ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క ప్రధానమైన పెద్ద యంత్రమువంటివాడుగా ఉంటుండాలి. ఆ యంత్రములో Parts, bolts, nuts సర్వమూ సరైన స్థితిలో ఉండాలి. మొట్టమొదట మనలను మనం పరీక్షించుకోవాలి, "నేను చెప్పినది చేస్తున్నానా లేదా, నేను తలుచుకున్నదంతా నా హృదయములోపల సరియైనదిగా ఉందా లేదా నా responsibility నేను సక్రమముగా చేస్తున్నానా లేదా", అని చూసుకోవాలి. యజమానులు, workers మధ్య ఈ connection, personal గా ఉంటుండాలి. ఈనాడు personal touch ఉండటంలేదు. ఒకరికొకరికి మధ్యలో యింకొకరు ఉంటారు. ఈ మధ్యలో ఉండినవారు communication సరిగా యివ్వలేకపోతే అంతా చెడిపోతుంది. కనుక, యీ విధముగా మన శక్తి, సామర్థ్యములు మొట్టమొదట మనము పరీక్షించుకోవాలి.

### సేవయే నిజమైన సాధన

ప్రేమస్వరూపులారా! యివన్నీ ఎందుకోసం చెబుతున్నానంటే నిజముగా యిది ఒక గొప్పసాధన. ఇది మనము తరించటానికి సాధన. ఏధ్యానము, ఏభజనలు, ఏది మీరు చేయలేకుండా పోవచ్చు. ఈ సేవయే మనకు నిజమైన సాధన. మనము చేయకపోయినా పది మందితో చేయిస్తే యిదే గొప్ప సాధన. ఇంతమందితో మంచిపని చేయించేవాడు యెంత గొప్పవాడుగా ఉంటాడు. అదికూడను మనయొక్క గొప్పతనమే! ఇంకొకటికూడ మీకు కొంచెం హెచ్చరించవలసిన అవసరము వచ్చింది. కొన్నికొన్ని states లోపల seminars అని పెట్టుకుంటున్నారు. ఇవి కొన్ని అర్థములేని seminars గా రూపొందుతున్నాయి. ఏదో పదిమందిని పిలిపించటము, పదిమందితో ఉపన్యాసములు యిప్పించటము, యిదే seminar. ఈ విధముగా డబ్బును వ్యయము చేయుటము మంచిది కాదు. మీరు స్థానికంగా ఉండినవారితోనే పని చేయించుకోండి. ఎక్కడెక్కడినుండో వారిని పిలిపించుకొని యీ ఛార్జీలు యెందుకు waste చేస్తున్నారు? ఇంక వచ్చేవారు చూద్దామా అంటే ఒకే టేపురికార్డు మాదిరి ఉంటున్నారు. యీ టేపురికార్డు తీసుకుంటే, వారుచెప్పే పదములు కూడను వ్యత్యాసముగా

srisathyasaivachanamrutam

ఉండవు. ఒకే speech. ఇవి కొన్ని కంఠస్థము చేసుకొని ఉంటారు. ఇటువంటి ఉపన్యాసములు ప్రయోజనము లేదు. ఆస్థానమునకు, ఆ పరిస్థితికి, ఆ సేవకు తగిన examples మనం అందించాలి. అంతేకాదు, మన అనుభవములో ఉండినవి, స్వంత అనుభవమును చెప్పాలి. ఎవరెవరో చేసినవన్నీ వినిపించకూడదు. యింతే కాకుండా స్వామియొక్క విషయాన్ని కూడను మీరు ఎక్కువగా చెప్పనక్కరలేదు. మీరు చేసేపనులు చెప్తే అప్పుడు స్వామియొక్క ఘనత తప్పక వస్తుంది. మాస్వామి యిట్లా అట్లా అని చెప్పి నీవు చేసే దాంట్లో తక్కువగా ఉంటే యేదో ఒక మిషనరీస్ చేసినట్లుగా ఉంటుంది. స్వామిది తక్కువగా చెప్పి మీ అనుభవాలు యెక్కువగా చెప్పండి. సేవలు ఎక్కువగా చేయండి. అప్పుడే స్వామి యొక్క తత్త్వము చక్కగా గుర్తించుకోగలుగుతారు.

## సత్యసాయి సంస్థలలో ఒకరినొకరు విమర్శించుకోకూడదు

ఇంతేకాకుండా సత్యసాయి ట్రస్టు, సత్యసాయి ఆర్గనైజేషనులు, యింకా అనేక సంబంధమైన సంస్థలు అన్నీ కలసిమెలసి పని చెయ్యాలి. పేరుకు వేరు వేరు గాని, అన్ని సంస్థలు సత్యసాయికి సంబంధించినవే! మన సంస్థలోనే యీ విధమైన ఐకమత్యము చూపలేకపోతే బయట ఏ విధముగా మనము అభివృద్ధి గాంచుతాము? మనలో మనకు యేమైనా differences వచ్చినప్పుడు, యీ భక్తులంతా ఎలాంటి వారంటే అక్కడవైపున కొంతమంది యిక్కడ వైపున కొంతమంది చేరుతారు. ఇక్కడ కొంత కొంత భేదాలు యేర్పడుతూ ఉంటాయి. మీరు గ్రూపులుగా తయారు కాకూడదు. ఒకరితో ఒకరికి పొరపొచ్చాలు రావచ్చుకాని ఒకరికొకరు adjust చేసుకొని, understand చేసుకొని ఐకమత్యాన్ని పెంచుకోవాలి. మనిషన్న తరువాత యేవోకొన్ని పొరపాట్లు వస్తుంటాయి. కానీ adjust చేసుకోవాలి. మన సంస్థలో అదే నిజమైన ప్రధానమైన సాధన. అంతేకాకుండా మనసంస్థలో ఉండినవారు ఒకరిని ఒకరు విమర్శించటానికి యేమాత్రము పూనుకోకూడదు. ఎవరిని విమర్శించకూడదు. ఎవరికి విమర్శ చేసే అధికారము లేదు. ఎందుకంటే, మనలో దోషములు లేనప్పుడు యితరుల దోషములు మనం చూడనే చూడము. ఒకవేళ దోషమే నీలో ఉంటే యితరుల దోషము చెప్పటానికి

srisathyasaivachanamrutam

అధికారమే నీకు లేదు. రెండు విధాలాకూడను యితరులను యే విధముగాను విమర్శించటానికి వీలుకాదు. అందరు brothers, brothers, sisters, sisters యీ విధమైన ఐకమత్యము మనము పెంచుకోవాలి.

**సత్యసాయి సంస్థలలో కార్యక్రమాలకు సాధ్యమైనంతవరకు స్థానికులు, సంస్థను గురించి తెలిసి అభిరుచి ఉన్నవారిని మాత్రమే ఆహ్వానించండి!**

ఇంకొక విషయము. నేను ప్రత్యేకముగా అనేక పర్యాయములు మీకు చెప్పాను. మన సంస్థలోపల జరిగే కార్యక్రమాలకు సంస్థలను గురించి బాగాతెలిసి, మన సాయీ సంస్థలోపల అభిరుచి ఉన్నవారు, స్వామిపై interest చూపించేవారు యిలాంటివారినే పిలుస్తే మంచిది. కొంతవరకు ప్రభుత్వమువారినే invite చేయవచ్చు. యిప్పుడు Chavan ఉంటున్నాడు; యిలాంటివారు స్వామిని గురించి చక్కగా తెలిసినవారు వచ్చినా యెలాంటి బాధ ఉండదు. వేరే తెలియని గవర్నమెంటు వారిని మనము invite చేసి వారు యేమి మాట్లాడుతారో, ఏవిధముగా behave చేస్తారో దానివలన సంస్థకే కాకుండా ఆ సభకుకూడను ఒక విధమైన అవమానకరమై పోతుంది. కొన్ని కొన్ని states లోపల యీవిధముగా జరిగింది, పాపం! భక్తిగా వారు పిలుస్తూ ఉంటారు, తప్పేమీ లేదు. కానీ, వారు యెలాంటివారని ముందు back ground తెలుసుకొని పిలవాలి. దీనికో చిన్న example. మొన్న కేరళలో జరిగింది. కేరళలో ఒక కార్యక్రమానికి యెంతో భక్తిశ్రద్ధలతో గవర్నరును పిలుస్తే బాగుంటుందని పాపం నటరాజన్‌పోయి గవర్నరును పిలిచాడు. ఆ అమ్మ వస్తానని ఒప్పుకుంది. చివరి నిమిషంలో నేను రానని చెప్పింది. అటువంటి పరిస్థితులలో ఎంత అవమానమైపోతుంది చెప్పండి! ఇలాంటి సమయములో అటువంటి వారిని పిలవకుండా ఉంటేనే బావుంటుంది. అందువలన, నేను గవర్నమెంటుతో ఎక్కువ పెట్టుకోకుండా ఉండటం మంచిదని చెప్తూతున్నాను. అయితే తెలిసినవారు, సాయీ సంస్థలను understand చేసుకున్నవారు, సాయిపై అభిరుచి కలిగిన వారిని పిలిచినా తప్పులేదు. అప్పుడే సభకు కూడను శోభ యేర్పడుతుంది. యీ విధమైన seminars సాధ్యమైనంతవరకు తగ్గించుకొని సేవను పెంచుకోండి. దీంట్లో సాధ్యమైనంతవరకుకూడను మన ప్రాంతములో ఉండినవారిని మనము పిలుచుకొని ఖర్చులు

తగ్గించుకోటానికి ప్రయత్నము చేయండి. అయితే responsibility తీసుకున్న Incharge అంతలెక్కా తిరగవలసినదే! South, north అని incharge పెట్టుకున్నారు. వారుకూడా తిరగవలసినదే. కానీ, మిగిలినవారు మన మన ప్రాంతములలో చక్కగా అనుభవము ఉండినవారు, చిన్నవారైనాసరే వారినే పిలిపించి మన సభను పూర్తి చేసుకోవచ్చును. ఖర్చులు అధికము కాకుండా, ఆడంబరము లేకుండా, భక్తులకు matter ను అందిస్తూ వారి ఉత్సాహమును అభివృద్ధిగావించే కార్యక్రమములో మనము పాల్గొనాలి.

ముఖ్యముగా మీరు యీనాటినుండి చేయవలసినది ఏమంటే యిక్కడకు వచ్చిపోయే భక్తులు అని తెలిసిఉంటే వాళ్లందరని సంస్థలో చేర్చటానికి తగిన కృషి చేయండి. ఏ విషయమైనకూడను సంస్థకు సంబంధించిన విషయములలో మీలో మీరే సంప్రదించుకొని, మీలో మీరే దానికి సరైన తీర్మానము చేసుకొని పనులు సక్రమంగా పూర్తి చేసుకోండి! నావరకు రానక్కరలేదు. ఎందుకంటే యీ సంస్థ నాదికాదు. నా పేరు పెట్టుకున్నారేగాని, నాకూ మీకూ వ్యక్తిగతమైన సంబంధము ఉంటుండాదిగాని, సంస్థకు నాకు ఎట్టి సంబంధము లేదు. నాకు, నీకు సంబంధము. దీనిని యెవ్వరూ ఏమాత్రం అడ్డు చేయడానికి వీలులేదు. అది మీకూ, నాకూ ఉండిన అనుబంధము. కానీ యీ organisation విషయములో మాత్రము మీమీ అధికారులకు state presidents కు, convenor కు మీరంతా సంప్రదించుకొని చక్కగా తీర్మానము చేసుకోవచ్చు. చాలా సంతోషము. తిరిగి, యిరవైఐదవసంత్సరము silver jublee అన్నారు. ఈ సిల్వర్ జూబ్లీ అని మీరు పెద్దగా ఆడంబరముగా చేయనక్కరలేదు. బాలవికాస్, సేవా కార్యక్రమములు, యీ village work చేసుకొని చక్కగా సేవలలోపల సిల్వర్ జూబ్లీని చక్కగా పదిమందికి ఆనందాన్ని అందించే మార్గములో ప్రవేశపెట్టండి.

**(తేదీ. 30-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam